క్లుప్తంగా

గీతా జ్ఞానంతో మోక్ష మార్గం



ప్రవచనాలు చెప్తున్న ఛత్రపతి

కోరుట్ల: శ్రీమద్భగవద్గీత అధ్యయనంతో మోక్ష మార్గం లభిస్తుందని ఉత్తమ గీతా ప్రబోధక్ చీలమంతుల ఛత్రపతి అన్నారు. పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో గీతా సత్సంగ్ ఆధ్వర్యంలో 76వ గీతా జ్ఞాన యజ్ఞంలో భాగంగా మూడో రోజు తొమ్మిదో అధ్యాయం రాజ విద్యా రాజ గుహ్య యోగంపై ప్రవచించారు. భగవద్గీత కూడా మహా భారత మధ్య భాగం నుంచి వచ్చిందని రాజ విద్య, ఆత్మవిద్య గురించి భగవానుడు తెలిపాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతా సత్సంగ్ అధ్యక్షుడు బచ్చు శ్రీనివాస్, మంచాల జగన్, అడ్వాల ప్రభాకర్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఈతవనం దగ్ధం



కాలిపోతున్న ఈతవనం

మేడిపల్లి: మండలంలోని దేశాయిపేటలో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని సుమారు 500 ఈతవనం దగ్ధమైంది. దేశాయిపేట గౌడ కులస్తుల వివరాల ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు చెలరేగిందని, సుమారు 500 వరకు ఈత వనం దగ్ధమైందని తెలిపారు. గీత వృత్తిని నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న తమకు, చెట్లు అగ్నికి ఆహుతి కావడం ఎంతో నష్టాన్ని మిగుల్చుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రమాదవశాత్తు వరి పంట ..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో ప్రమాదవశాత్తు వరి పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన వేగంటి శ్రీనివాస్‌గౌడ్ అనే రైతు సాగు చేసిన వరి పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఏడెకరాల్లో వరి సాగుచేయగా, ప్రమాదంలో ఐదున్నర ఎకరాల పంట దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకుని సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.4.50 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు శ్రీనివాస్ కోరారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

కోరుట్ల: పట్టణంలోని ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో శుక్రవారం ఎన్నికల సిబ్బందికి మొదటి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో ఉద్యోగులు జాగ్రత్తతో వ్యవహరించాలని కోరారు. కొంత మంది పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం సమయం ముగియక ముందే వెళ్లిపోయిన విషయాన్ని గుర్తించిన ఆర్డీవో ఆనంద్‌కుమార్ శిక్షణ కార్యక్రమం చివరి వరకు ఉండి పోలింగ్‌పై తీరుపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విషయంలో ట్రైనర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది నిక్కచ్చిగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటే



మాట్లాడుతున్న లింబాద్రి

కోరుట్ల: దేశంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనని నిజామాబాద్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థి పుప్పాల లింబాద్రి అన్నారు. కోరుట్లలో శుక్రవారం మాట్లాడుతూ ఆ రెండు పార్టీలు బడుగు, బలహీన వర్గాలను మోసం చేస్తున్నాయన్నారు. బీజేపీ హయాంలో పెట్రోల్, డీజీల్, సిలిండర్ ధరలు పెరిగాయన్నారు. దేశంలో యువతకు 2 కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. దేశాన్ని ఎన్నో ఏళ్లు పాలించిన కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాలకు ప్రధానమంత్రి అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రజలు ఈ రెండు పార్టీలను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మారంపల్లి శ్రీధర్, గురుమంత్రుల ప్రభాకర్, జాగర్ల రోజ రాణి, చెప్యాల సూరజ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో వినూత్న సేవలు

- పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే
- స్కూళ్లకు వెళ్లనున్న ఐదేళ్లు నిండిన చిన్నారులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ఐదేళ్లపాటు అంగన్ వాడీలో చదువు పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రమోట్ చేసేందుకు ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నారు. దీంతో పిల్లలో ఉన్న భయం తొలగిపోనుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల వయస్సు తెలిసి తెలియనిది. కేంద్రాల్లో ఆటపాటలతో గ్రాడ్యుయేషన్ వేడుకలను నిర్వహిస్తున్నారు. చిన్నారుల తల్లుల సమక్షంలో చేస్తుండటంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులు పాఠశాలలకు ప్రమోట్ అవుతున్నారు. దీని కోసం కేంద్రాల్లో వీరికి వీడ్కోలు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నారుల ప్రతిభను గుర్తించి ప్రోగ్రెస్ కార్డులను వారి తల్లులకు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమం జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహి స్తున్నారు. చిన్నారులు తక్కువగా ఉన్నచోట అక్కడున్న అన్ని అంగన్‌వాడీకేంద్రాల పిల్ల లను కలిపి, ప్రముఖులు, వైద్య సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు, ఇతర పెద్దలను ఆహ్వానించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా పిల్లలను పట్టభద్రులుగా అలకంరించి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. కార్యక్రమాల్లో పాల్గొంటున్న తమ పిల్ల లను చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

3200 మంది పాఠశాలలకు..

జిల్లాలో మెట్‌పల్లి, జగిత్యాల, ధర్మపురి, మల్యాలలో మాతా శిశురక్షణ (ఐసీడీఎస్) ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో 1065 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 48,991, గర్భిణులు 6389, బాలింతలు 6569 మొత్తం కలిపి 61949 మంది లబ్ధి పొందుతున్నారు. వీరిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న బాలబాలికలు సుమారు 3200 మంది ఉన్నారు. వీరందరిని పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంది. బడిబాటలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల వారీగా వివరాలు సేకరించి పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

పాఠశాలకు సిద్ధం చేయడమే



పిల్లలో ఉన్న భయాన్ని పోగొట్టి పాఠశాలకు సంసిద్ధం చేయడం కోసమే అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నాం. చిన్న పిల్లలు అమ్మ ఒడిలాంటి అంగన్‌వాడీ నుంచి పాఠశాలకు వెళ్లే దశకు వచ్చారు. బడి అంటే పిల్లలో ఏదో తెలియని భయం ఉంటుంది. ఆ భయాన్ని తొలగించడం కోసమే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇటువంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నాం.

– నర్సింగరాణి, సీడీపీవో, మల్యాల

ఘనంగా జరుపుకున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరుపుకున్నాం. పిల్లలను పట్టభద్రులుగా అలంకరించి వారికి సర్టిఫికెట్లు ఇచ్చే సన్నివేశం చూడ ముచ్చటగా ఉంటుంది. పిల్లలను పట్టభద్రులుగా కేంద్రాలను అందంగా అలంకరించి పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుతున్నాం. పిల్లల తల్లిదండ్రులు, ఇతరశాఖల అధికారులను ఆహ్వానించి అంగన్‌వాడీ సేవలు, కార్యక్రమాలు వివరిస్తున్నాం.

– వనజాత, అంగన్‌వాడీ టీచర్ పెగడపల్లి

సంతోషంగా ఉంది



మా పాప అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతుంది. ఇక్కడ ప్రీస్కూల్లో భాగంగా టీచర్లు బోధిస్తున్న తీరు పిల్లలకు ఉపయోగకరంగా ఉంది. గ్రాడ్యుయేషన్ పేరిట నిర్వహించిన కార్యక్రమాల్లో చిన్నారుల అలంకరణ, వారి ప్రవర్తన, క్రమశిక్షణ తదితర అంశాలు తల్లులను ఆకట్టుకుంటున్నాయి. ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పిల్లలను పాఠశాలకు పంపించేందుకు ఏర్పాటు చేసుకుంటున్నాం.

– పొరండ్ల శ్రీజ, విద్యార్థి తల్లి, బతికపల్లి

ఫ్రూట్ హబ్‌గా జగిత్యాల



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం ఫ్రూట్ హబ్‌గా మారిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 23, 24, 25, 39 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమీకృత మార్కెట్ పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం పండ్ల మార్కెట్ ఏర్పాటుతో నేడు ఫ్రూట్‌హబ్‌గా జగిత్యాల మారిందన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమిండ్ల శ్రీనివాస్, ఆనందరావు, పవన్, రాజ్‌కుమార్, పృథ్వీ, దుమాల రాజ్, శ్రీనివాస్, శరత్‌రావు పాల్గొన్నారు.

తాతా.. బీఆర్ఎస్‌కే మీ ఓటు

తాత బీఆర్ఎస్‌కే ఓటు వేయాలి, అభ్యర్థిని గెలిపించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వృద్ధుడిని కోరారు. గతంలోనే అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. అలాగే ర్యాలీ నిర్వహించారు.

ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ కమల

కోరుట్ల: కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ కౌన్సిలర్ ఆడెపు కమల ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడెపు కమల మాట్లాడుతూ రైతు వర్గాలకు, పేదలకు పెన్నిధిగా నిలిచిన జీవన్‌రెడ్డికి మద్దతుగా నిలిచి చేయి గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆడెపు మధు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సమస్యలు తెలిసిన వ్యక్తి జీవన్ రెడ్డి

సీనియర్ సిటిజన్ల సమస్యలు తెలిసిన వ్యక్తి కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి అని కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలో సీనియర్ సిటిజెన్స్‌తో శుక్రవారం సమావేశమయ్యారు. సీనియర్ సిటీజన్ల సమస్యలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, సీనియర్ సిటిజెన్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో న్యాయవాదుల కార్నర్ మీటింగ్

జగిత్యాలజోన్: ప్రతి మండల కేంద్రంలో నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా న్యాయవాదులు కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తారని లీగల్ సెల్ కన్వీనర్ గుంటి జగదీశ్వర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండల కేంద్రంతో పాటు ఆయా కోర్టుల పరిధిలో బార్ అసోసియేషన్లలో న్యాయవాదులను కలిసి జీవన్‌రెడ్డికి అనుకూలంగా ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, పీసీసీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు బెత్తపు లక్ష్మన్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బండ భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జీవనన్నకు అండగా నిలవాలి

జగిత్యాలటౌన్: అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవనన్నకు ఓటు వేసి అండగా నిలవాలని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 35వ వార్డులో జీవన్‌రెడ్డికి మద్దతుగా అడువాల జ్యోతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్ జయశ్రీ, నాయకులు రఘు, అడువాల లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

మోసం చేసేందుకే ప్రజల వద్దకు కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అర్వింద్

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): పదేళ్లు ప్రజలను కేసీఆర్ నమ్మించి మోసం చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ మోసం చేసేందుకే ప్రజలకు వద్దకు వస్తోందని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చలేదన్నారు. తులం బంగారం, రూ.4 వేల పెన్షన్, రూ.2,500 పెన్షన్, రైతులకు రూ.500 బోనస్, రూ.15 వేల రైతుబంధు, రూ.2లక్షల రుణమాఫీ చేయలేదని విమర్శించారు. మన దేశ ఆర్థిక వ్యవస్థను 11వ స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకువచ్చిన ఘనత మోదీదే అని వెలడించారు. ఇష్టారీతిన వాగ్దానాలు చేసేవారిని నమ్మవద్దని, పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మెట్‌పల్లి మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆ ప్రమాదానికి సీఎం కాన్వాయ్‌తో సంబంధం లేదు'

జగిత్యాలక్రైం: కోరుట్లలో ఈనెల 1న జరిగిన ముఖ్యమంత్రి సభ నేపథ్యంలో మెట్‌పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై సీఎం కాన్వాయ్ ఢీకొందని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అది నిజం కాదని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. శుక్రవారం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1న మెట్‌పల్లిలో ఉదయం 10 గంటలకు ఓ కారు డ్రైవర్ బసవరాజు మెట్‌పల్లి పెట్రోల్‌బంక్‌లో డీజిల్ నింపుకుని బయటకు వస్తూ ద్విచక్రవాహనం నడిపే భూక్య భూమా అనే వ్యక్తిని ఢీకొనగా తలకు గాయం కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారని, మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా అతడు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ బసవరాజుపై కేసు నమోదు చేయడం జరిగిందని, కానీ ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో సీఎం కాన్వాయి ఢీకొనడం వల్ల ప్రమాదం జరిగిందని అవాస్తవాలు ప్రచారం చేయడం జరుగుతుందని, సీఎం కాన్వాయ్ వాహనానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ కేసులో త్వరితగతి పూర్తి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

బీజేపీకి మరోసారి అవకాశం ఇవ్వండి

ధర్మపురి: అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన అందిస్తున్న బీజేపీని మరోసారి గెలిపించాలని ఓటర్లను కోరారు. మండలంలోని దొంతాపూర్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టి పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.సంగెపు గంగారాం, నార్ల విజయ్‌కుమార్, పత్తి తిరుపతి, కిరణ్ పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

బుగ్గారం: డబ్బుల విషయంలో ఏర్పడిన వివాదం నేపథ్యంలో ఓ పత్రికా విలేకరిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుగ్గారం గ్రామశివారులోని జాతీయ రహదారిపై ఎక్స్‌రోడ్డుకు సమీపంలోని రైస్‌మిల్‌కు జీవన్‌రెడ్డి, సుధాకర్ అనే ఇద్దరు వ్యక్తులు వెళ్లి డబ్బులు డిమాండ్ చేయడమే కాకుండా అక్కడ పనిచేసే రాజన్న అనే వ్యక్తిపై దాడి చేశారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి రాజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జిల్లాలో 13 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

జగిత్యాలటౌన్: గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలకు పదును పెట్టేందుకు 13 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి డా.కోరుకంటి రవికుమార్ తెలిపారు. శిక్షణ శిబిరాల నిర్వాహకులకు శుక్రవారం క్రీడా సామగ్రి అందజేసి మాట్లాడారు. శిబిరాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

బీజేపీ,కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు



కార్యకర్తలతో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లిరూరల్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు చేసిందేమిలేదని వారి మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి, రాజేశ్వర్‌రావుపేట, విట్టంపేట, మెట్లచిట్టాపూర్,రామలచ్చక్కపేట గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రెండు పార్టీల వైఫల్యాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు.అలాగే రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఎట్టిపరిస్థితుల్లో ఆయన్ని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సాయిరెడ్డి,బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నా బీఆర్ఎస్‌కు మద్దతివ్వండి



బీఆర్ఎస్‌కు మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే

కోరుట్ల: అన్నా బీర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కోరారు. పట్టణంలోని నంది చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రధాని ధ్యేయం



వస్తాపూర్‌లో ప్రచారం చేస్తున్న భోగ శ్రావణి

జగిత్యాలరూరల్: మహిళల సంక్షేమమే ప్రధాని ధ్యేయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. రాయికల్ మండలంలోని వస్తాపూర్‌లో శుక్రవారం నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ దేశరక్షణకు కృషి చేస్తున్నారన్నారు. దేశరక్షణ కోసం ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ఎంపీటీసీ ఆకుల మహేశ్, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, నాయకులు సంజీవ్, లక్ష్మణ్, నవీన్, చంద్రశేఖర్, సబిత, పావని తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

జగిత్యాలటౌన్: కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్‌ను గెలిపించి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని బీజేపీ సీనియర్ నాయకుడు వీరబత్తిని అనిల్‌కుమార్ కోరారు. శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఓటర్లను కలుస్తూ మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. అర్వింద్ రెండో సారి భారీ మెజారిటీతో గెలిపిస్తే మోదీ క్యాబినెట్‌లో మంత్రి అవుతారని, దీంతో జగిత్యాల అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దేశంలో సుపరిపాలన ప్రధాని మోదీతోనే సాధ్యం



చింతకుంటలో ప్రచారం చేస్తున్న వికాశ్‌రావు

కథలాపూర్: దేశంలో సుపరిపాలన ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే పట్టం కట్టాలని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాశ్‌రావు కోరారు. మండలంలోని చింతకుంట, పెగ్గెర్ల, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కరోనా కష్టకాలంలో దేశ ప్రజలు ఆందోళన చెందుతున్న తరుణంలో ఉచితంగా వాక్సిన్ అందించిన ఘనత ప్రధాని మోదీదేనన్నారు. దేశంలో ధర్మపాలన అందించాలంటే ప్రజలు బీజేపీకి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్మల వినోద్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్ బద్రి సత్యం, పిడుగు ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'రాబోయేది కాంగ్రెస్ డబుల్ ఇంజిన్ సర్కారే'

మల్లాపూర్: ప్రజల మద్దతుతో పార్లమెంట్ ఎన్నికల్లో రాబోయేది కాంగ్రెస్ డబుల్ ఇంజన్ సర్కారేనని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మల్లాపూర్ కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఎమ్మెల్యే, మంత్రి, ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి చేసిన అభివృద్ధి జిల్లా వ్యాప్తంగా కనిపిస్తోందని, 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలు, కార్మిక, రైతాంగ సమస్యలపై పోరాడిన చరిత్ర ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిదని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, కోటగిరి ఆనంద్ గౌడ్, గడ్డం అశోక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాకేశ్, బొల్లం రఘు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి జీవన్‌రెడ్డిని గెలిపించాలి

జగిత్యాలరూరల్: ప్రజల మనిషి జీవన్‌రెడ్డిని గెలిపించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలంలోని చింతలూరు, ఒడ్డెలింగాపూర్, రాయికల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

మెట్‌పల్లిరూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి,సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్,ఆత్మకూర్ గ్రామాల్లో శుక్రవారం ఉపాధి కూలీలను కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంధర్‌రెడ్డి,మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి, దుంపేట గ్రామాల్లో మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి, ఉపాధిహామీ పథకం పనుల వద్దకు వెళ్లి కూలీలను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు మామిడిపెల్లి రవి, దొప్పల జలందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో..

మేడిపల్లి: మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఉదిగిరి రమ్య ఆధ్వర్యంలో కమ్మరిపేట,వెంకట్రావుపేట మన్నెగూడెం, దేశాయిపేటలో శుక్రవారం ప్రచారం చేశారు. బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు క్యా తం సత్తిరెడ్డి, అంగడి ఆనంద్, రవీందర్ రావు, చిన్నరాజం, తాలుక గంగరాం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్ దంపతులు

జగిత్యాలటౌన్: పద్మశాలీ సేవాసంఘం కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్, పద్మ దంపతులు బీఆర్ఎస్‌ను వీడి శుక్రవారం జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరబత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్‌గా పనిచేసిన తాను బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి రావడం సొంత ఇంటికి వచ్చినట్లుందన్నారు. జీవన్‌రెడ్డిని నిజామాబాద్ ఎంపీగా గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు.

పత్రికాస్వేచ్ఛను కాపాడటం ప్రతీ ఒక్కరి బాధ్యత

జగిత్యాలరూరల్: పత్రికాస్వేచ్ఛను కాపాడటం ప్రతీ ఒక్కరి బాధ్యత అని రాయికల్ ప్రెస్‌క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి అన్నారు. శుక్రవారం పత్రిక స్వేచ్ఛ దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న పాత్రికేయుల హక్కులను కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్‌లో శ్రీ లక్ష్మీ వేంకకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, తెలంగాణ జనసమితి నాయకుడు కంతి మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు చక్రపాణి మాదవచార్యులు, నవీన్‌చార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల: రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం: 1800 425 9899